క్లుప్తంగా

మంత్రిని కలిసిన 'మర్రి'



మంత్రి కోమటిరెడ్డిని సన్మానిస్తున్న చైర్మన్

ఇబ్రహీంపట్నం రూరల్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌లను ఆదిబట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇరువురికి శాలువాలు కప్పి సన్మానించారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

మాడ్గుల: నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్ అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని నల్లాచెరువు గ్రామానికి చెందిన వెంకటయ్యకు రూ18 వేల చెక్కు మంజూరు అయింది. ఈ మేరకు శనివారం నగరంలోని ఆయన నివాసంలో లబ్ధిదారుడికి అందజేసి మాట్లాడారు. ఆరోగ్య సమస్యలతో ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఖరీదైన వైద్య చికిత్స చేయించుకోలేక ఇబ్బంది పడుతున్న వారికి సీఎంఆర్‌ఎఫ్ ఆసరా అవుతోందని, అత్యవసర సమయంలో బాధితులు పథకాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. నాయకులు నవీన్ గౌడ్, శ్రీశైలం, కృష్ణ, శేఖర్ ఉన్నారు.

ఏబీవీపీ నూతన కమిటీ ఎన్నిక



కమిటీ సభ్యులకు నియామక పత్రం అందజేస్తున్న శ్రీరామ్

కడ్తాల్: విద్యార్థుల సమస్యలపై ఏబీవీపీ నిరంతరం పోరాటం చేస్తుందని పరిషత్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కందాడి శ్రీరామ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పరిషత్ పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం కడ్తాల్ నగర కార్యదర్శిగా నేనావత్ పవన్, ఉపాధ్యక్షుడిగా ఉమేశ్, సంయుక్త కార్యదర్శిగా శ్రీకాంత్, స్టూడెంట్ డెవలప్‌మెంట్ కన్వీనర్‌గా అఖిల్, క్రీడా కన్వీనర్‌గా గణేశ్, విద్యార్థి సేవ కన్వీనర్‌గా దశరథం, కార్యవర్గ సభ్యులుగా నరేందర్, పవన్, సందీప్, దిలీప్‌ను నియమించారు. అనంతరం నూతన కమిటీకి నియామక పత్రం అందజేశారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీఐ

ఇబ్రహీంపట్నం: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ గురునాయుడు హెచ్చరించారు. శనివారం ఆయన ఇబ్రహీంపట్నం ప్రధాన రహదారిపై వాహనదారులకు నిబంధనల గురించి అవగాహన కల్పించారు.

డ్రైనేజీ పైపులైన్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న చైర్ పర్సన్ స్రవంతి, కమిషనర్ రవీంద్రసాగర్

ఇబ్రహీంపట్నం: మున్సిపాలిటీలో రూ.75 లక్షలతో 1, 20వ వార్డుల్లో కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి పరిశీలించారు. నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలని నిర్మాణ దారులను ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ రవీంద్రసాగర్, ఏఈ గుణాకర్, కౌన్సిలర్ ఎండీ సుల్తానా బేగం, కంట్రాక్టర్ రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

నియామకం

అబ్దుల్లాపూర్‌మెట్: అఖిల భారత యాదవ మహాసభ అబ్దుల్లాపూర్‌మెట్ యువజన విభాగం మండల అధ్యక్షుడిగా బొడుసు రాఘవేందర్‌యాదవ్‌ను నియమించారు. ఈ మేరకు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పేరమోని లక్ష్మీపతి యాదవ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాఘవేందర్ మాట్లాడుతూ.. తనపై విశ్వాసంతో బాధ్యతలు అప్పగించినందుకు ఆనందంగా ఉందని, ఇందుకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. యాదవుల ఐక్యతకు కృషి చేస్తానన్నారు.

భక్తుల కొంగు బంగారం మల్లన్న

- నేటి నుంచి కల్యాణోత్సవం
- తరలిరానున్న భక్తజనం

హయత్‌నగర్: భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న పోదమురా భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవానికి వేళయింది. మూడు రోజుల పాటు జరగనున్న వేడుకలకు మునుగనూరు మల్లన్న గుట్ట ముస్తాబయింది. నాలుగు శతాబ్దాల చరిత్ర కలిగిన గుట్ట ఎంతో ప్రసిద్ధి చెందింది. ఏటా జనవరి మొదటి ఆదివారం నిర్వహించే ఉత్సవానికి నగరంతో పాటు.. పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి రానున్నారని నిర్వాహకులు తెలిపారు. మల్లికార్జున స్వామితో పాటు ఇక్కడ వెలసిన ఎల్లమ్మ, ఆంజనేయ స్వామి ఆలయాలను భక్తులు దర్శించుకుంటారని పేర్కొన్నారు.

ఆలయ చరిత్ర...

మూడు కోట్ల దేవుళ్ల కంటే మునుగనూరు మల్లన్న గొప్ప అనే పదం ఈ ఆలయ గొప్పదనాన్ని తెలియజేస్తుంది. స్వామివారు కొమురవెల్లికి వెళ్తూ.. మునుగనూరు గుట్టపై కాలుమోపి వెళ్లారని పూర్వీకులు పేర్కొంటున్నారు. ఇదే విషయాన్ని గీత కార్మికుడికి స్వామివారు కలలోకి వచ్చి.. చెప్పారని, దీంతో ఆ గౌడన్న, ఇక్కడి కొండరాళ్ల సారికలో వెలసిన దేవుడి రూపాన్ని గుర్తించినట్లు ప్రచారం.





జాతరకు ముస్తాబైన మల్లన్నగుట్ట (ఇన్‌సెట్)లో కొండ సారికలో కొలువైన మల్లికార్జునుడు

రేపు కల్యాణోత్సవం..

మల్లన్న కల్యాణోత్సవం శనివారం నుంచి ప్రారంభమైనా.. ఆదివారం సాయంత్రం స్వామి వారి ఊరేగింపు, రాత్రి బోనాల సమర్పణ, ఒగ్గు కథలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం తెలవారు జామున 4.15 గంటలకు కల్యాణవేడుక ఉంటుందని, అనంతరం అగ్నిగుండాల ప్రవేశం, సాయంత్రం స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు.

ఆటగాళ్లకు ప్రోత్సాహం.. అభినందనీయం

కడ్తాల్: గ్రామీణ ప్రాంతాల్లో టోర్నీలు నిర్వహించి, క్రీడాకారులను పోత్సహించడం అభినందనీయమని ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మూడు రోజులుగా కొనసాగుతున్న కడ్తాల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ఆమె శనివారం పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం క్రీడారంగాన్ని ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా టోర్నీ నిర్వాహకులు అతిథులను సన్మానించారు. జహంగీర్ అలీ, వెంకటేశ్, నర్సింహ, బీచ్యానాయక్ తదితరులు ఉన్నారు.



విజేత జట్టుకు జ్ఞాపిక అందజేస్తున్న మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి

ఎమ్మెల్సీ వెంకట్‌కు సన్మానం

ఆమనగల్లు: ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూరు వెంకట్‌ను శనివారం ఎన్ఎస్‌యుఐ జిల్లా కార్యదర్శి ఫరీద్.. నగరంలోని ఆయన నివాసంలో కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ వేంకటగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ ధర్మకర్త గూడ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో శనివారం ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, తులసీదళ అర్చన, తిరుప్పావై ప్రబంధ విన్నపం, బాలభోగ నివేదన, నక్షత్రహారతి కార్యక్రమాలు నిర్వహించారు.

హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరి

మీర్‌పేట: వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని ఇన్‌స్పెక్టర్ నాగరాజు సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసాన్ని పురస్కరించుకొని రాచకొండ పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం మీర్‌పేట, బడంగ్‌పేట కూడళ్లలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించకుండా వాహనాలు నడిపితే జరిగే నష్టాల గురించి వాహనదారులకు అవగాహన కల్పించడంతో పాటు సూచనలు చేసినట్లు సీఐ తెలిపారు.

పదివేల మొక్కలు సిద్ధం చేయండి



నర్సరీని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఏపీడీ నరేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: వనమహోత్సవం నాటికి గ్రామంలో నాటేందుకు పది వేల మొక్కలను సిద్ధం చేయాలని ఉపాధిహామీ ఇన్‌చార్జి ఏపీడీ నరేందర్ రెడ్డి అన్నారు. శనివారం ముకునూర్ గ్రామం నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రతిరోజు నర్సరీలకు అందుబాటులో ఉండి ఉదయం, సాయంత్రం మొక్కలకు నీరు పట్టాలని ఆదేశించారు. 75 రోజులు పనిపూర్తి చేసుకున్న కూలీలకు వంద రోజుల పని కల్పించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 4 వేల ప్యాకెట్లలో విత్తనాలు నాటామని పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ ఏపీడీకి తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ తిరుపతిచారి, కారోబార్ ఉస్మాన్, ఫీల్డ్ అసిస్టెంట్స్ లింగం, వాచర్స్ పాల్గొన్నారు.

అడిగిన వారందరికీ 'ఉపాధి'

ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

యాచారం: జాబ్ కార్డు ఉండి, అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించే విధంగా కృషి చేద్దామని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిధి 24 గ్రామాల్లోని కూలీలందరికీ చేతినిండా పని కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఏ గ్రామంలో ఎవరు వస్తారో గుర్తించి, ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ లింగయ్య, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మండల పరిధి గడ్డమల్లయ్యగూడ గ్రామంలో ఎంపీడీఓ.. ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. మండలంలో 50 శాతం సర్వే పూర్తయిందని, పక్షం రోజుల్లో పూర్తి చేస్తామని పేర్కొన్నారు.



ఈజీఎస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

నిధులు ఆపేస్తే ప్రజలకు ఇబ్బంది

- చెరువుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటా
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి



పెద్దచెరువు వద్ద అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: ప్రతిపక్షంలో ఉన్న ఎమ్మెల్యేలకు నిధులు, అభివృద్ధి ఆపేస్తే ప్రజలు ఇబ్బంది పడతారని, మంజూరైన నిధులను వెంటనే విడుదల చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి పెద్దచెరువు వద్ద రూ.1కోటి 80లక్షల వ్యయంతో చేపట్టనున్న క్రీడా ప్రాంగణం, ఫెన్సింగ్ పనులకు శనివారం ఆమె శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో లేక్ డెవలప్‌మెంట్ పేరుతో చెరువులను అభివృద్ధి చేయడంతో పాటు గుర్రపుడెక్క వంటి చిన్నచిన్న పనులు చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం గుర్రపుడెక్క తొలగించాలని ఎమ్మెల్యేగా తాను రెండుసార్లు లేఖ రాసినా స్పందన లేదని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించకుంటే స్థానిక కార్పొరేషన్ అధికారులు, పాలకవర్గమే బాధ్యత తీసుకుని పనులు చేసుకోవాలని సూచించారు. తన నియోజకవర్గంలోనే రూ.270కోట్ల నిధులను నిలిపివేశారని వెల్లడించారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కార్పొరేటర్ ధనలక్ష్మి, కమిషనర్ జ్ఞానేశ్వర్, డీఈ వెంకన్న, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కీసర గోవర్ధన్‌రెడ్డి, నాయకులు కామేశ్‌రెడ్డి, భూపేశ్‌గౌడ్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

చెరువుల నిర్వహణకు చర్యలు..

ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు కోట్లాది రూపాయలతో చెరువులను అభివృద్ధి చేశామని, అధికార యంత్రాంగంతో పాటు చెరువుల నిర్వహణలో స్థానిక కాలనీవాసులకు బాధ్యత ఉంటుందని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మంత్రాల చెరువు వద్ద ఏర్పాటు చేసిన గ్రిల్‌ను దొంగలు ఎత్తుకెళ్లడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. చందన చెరువు మాదిరిగా మంత్రాల, పెద్దచెరువు వద్ద ఎప్పటికప్పుడూ నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

చెత్తను కాల్చివేస్తే జరిమానా

మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్

మహేశ్వరం: బహిరంగ ప్రదేశాల్లో చెత్తను కాల్చివేస్తే రూ.5వేల జరిమానా విధిస్తామని కమిషనర్ బి.వెంకట్రామ్ హెచ్చరించారు. శనివారం ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాదితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధి ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తులు కొందరు.. చెత్తను డంప్‌చేసి నిప్పంటించి వెళ్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఇలాంటి చర్యలతో పర్యావరణానికి హాని చేకూరుతుందని, ఇకపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. ఎవరూ కూడా చెత్తను రోడ్లపై పడేసి నిప్పు పెట్టరాదని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ ఖాజా మోహిజుద్దీన్, పర్యావరణ అధికారి ఎం.శ్రీనివాస్, సిబ్బంది త్రివేణి, బాలమణి పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి నిధులివ్వండి

ఆమనగల్లు: ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. శనివారం నగరంలోని ఆయన నివాసంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడురు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి శాలువాలు కప్పి సన్మానించారు. కడ్తాల్ మండల కేంద్రంలో ప్రభుత్వ ఆస్పత్రి, ఆర్టీసీ బస్టాండ్, జూనియర్ కళాశాల, ఆమనగల్లులో డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని సీఎంను కోరినట్లు చైర్ పర్సన్ తెలిపారు.



ముఖ్యమంత్రితో చైర్‌పర్సన్ గీత, కాంగ్రెస్ నాయకులు

నూతన నియామకం

ఆమనగల్లు: ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షులుగా పట్టణానికి చెందిన వీరబొమ్మ రామ్మోహన్, చంద్రశేఖర్‌లను శనివారం నియమించారు. ఇటీవల అధ్యక్షుడిగా సురేశ్‌గుప్తా, ప్రధాన కార్యదర్శిగా కిరణ్‌కుమార్‌గుప్తా, కోశాధికారిగా బద్రీనాథ్‌గుప్తాలను, ఇప్పుడు వీరిని ఎన్నుకున్నారు. ఈ సభ్యుల ప్రమాణస్వీకారం ఈ నెల 5న హైదరాబాద్‌లోని సామ సరస్వతి గార్డెన్స్‌లో నిర్వహించనున్నామని మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు రామ్మోహన్ తెలిపారు.

హామీలే తప్ప చేసిందేమీ లేదు

అభివృద్ధిని అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే: బీజేపీ

ఆమనగల్లు: బీఆర్ఎస్ హయాంలో హామీలే తప్ప.. ఆమనగల్లుకు చేసిందేమీ లేదని బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రీకాంత్ సింగ్ ఆరోపించారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీ పాలకవర్గాన్ని విమర్శించే స్థాయి బీఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద రాష్ట్రానికి వచ్చిన నిధులను డబుల్ బెడ్‌రూం పేరుతో ఆ పార్టీ దారి మళ్లించిందని విమర్శించారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి కృషితో మున్సిపాలిటీలో నీటి సమస్య పరిష్కారానికి నల్‌జల్ పథకం కింద రూ.32 కోట్లు, ఆమనగల్లు– తలకొండపల్లి రోడ్డు విస్తరణకు రూ.37 కోట్లు, ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణానికి రూ.17.50 కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. అయితే పనులు చేపట్టడంలో నాటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అడ్డంకులు సృష్టించారని విమర్శించారు. ఎమ్మెల్యేగా జైపాల్‌యాదవ్ ఈ ప్రాంతానికి చేసిందేమిటో చెప్పాలని గులాబీ శ్రేణులను ప్రశ్నించారు. కేవలం రాజకీయ లబ్ధికోసమే ఆ పార్టీ నాయకులు ధర్నాలు చేస్తున్నారని శ్రీకాంత్ సింగ్ ఆరోపించారు. సమావేశంలో కౌన్సిలర్లు విజయ్‌కృష్ణ, చెన్నకేశవులు, కృష్ణనాయక్, కృష్ణయాదవ్, శ్రీశైలంయాదవ్, నాయకులు మహేశ్, రాజు, బుచ్చయ్య, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్‌సింగ్

విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, విద్యారంగాన్ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల అభివృద్ధికి రూ.20 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసి, అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఒకే ఒక డీఎస్సీ నిర్వహించిందని, అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోపే డీఎస్సీ నిర్వహించి టీచర్ల నియామకం చేపట్టి, సర్కారు బడుల బలోపేతానికి చర్యలు చేపట్టిందని వెల్లడించారు. సమావేశంలో పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, అడ్వకేట్ లక్ష్మణ్ శర్మ, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, జిల్లా నాయకులు బీక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ తదితరులు ఉన్నారు.

కష్టాల్లో పారిశుద్ధ్య కార్మికులు



మీర్‌పేట: ధర్నాలో మాట్లాడుతున్న నాయకులు

- పెండింగ్ జీతాలు చెల్లించాలి
- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జగదీశ్
- కార్మికుల నిరసన దీక్ష

ఇబ్రహీంపట్నం రూరల్: మున్సిపల్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.జగదీశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నెలల తరబడి జీతాలు లేక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. శనివారం ఆదిబట్ల మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన దీక్ష చేపట్టారు. వీరికి మద్దతుగా ఆయన మాట్లాడారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఎన్ఎంఆర్, ఫిక్స్‌డ్ పే కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. 2వ పీఆర్సీ ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులను కొన్ని మున్సిపాలిటీల్లో కార్మికుల ఖాతాల్లో జమ చేయడం లేదని ఆరోపిస్తూ.. తక్షణమే వాటిని జమ చేయాలని పేర్కొన్నారు. కార్మికులు మరణిస్తే దహన ఖర్చుల నిమిత్తం రూ.30 వేలు అందించాలని, విద్యార్హతను బట్టి పదోన్నతులు కల్పించాలన్నారు. కార్మికుల వయస్సు పైబడినా, ఆరోగ్య సమస్యలతో చనిపోయినా వారి స్థానంలో కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని కోరారు. కొత్త వారికి పాత కార్మికులతో సమానంగా రూ.16 వేల జీతం ఇవ్వాలని, మొదటి ప్రాధాన్యతగా వారికి డబుల్ బెడ్రూం కేటాయించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న పట్టణ విస్తరణకు అనుగుణంగా కార్మికులను నియమించాలన్నారు. అనంతరం కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం మున్సిపాలిటీ కన్వీనర్ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం రూరల్: దీక్షలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

పర్మినెంట్ చేయాలి

మీర్‌పేట: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కిషన్ డిమాండ్ చేశారు. మీర్‌పేట కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేశారు. వారికి మద్దతుగా ఆయన మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, అప్పటివరకు ఏపీలో అక్కడి ప్రభుత్వం ఇస్తున్నట్లుగా 21 వేలు ఇవ్వాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐలో చోటుచేసుకుంటున్న అవకతవకలపై తగిన విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. వారాంతపు సెలవులు, కార్మిక శాఖ ప్రతిపాదించిన జాతీయ సెలవులన్నింటినీ వర్తింపజేయాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు బాబు, శేఖర్‌యాదవ్, కార్మికులు భారతమ్మ, అంజూర, యాదమ్మ, యాదగిరి, నర్సింహ ఉన్నారు.

తుర్కయంజాల్‌లో..

తుర్కయంజాల్: మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, లేని పక్షంలో నిరవధిక సమ్మెకు దిగుతామని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కిషన్ హెచ్చరించారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం తుర్కయంజాల్ మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి దీక్ష చేపట్టారు. 48 గంటల పాటు నిరసన కొనసాగించనున్నామని పేర్కొన్నారు. ఈ నెల 6న కలెక్టరేట్ ముట్టడి చేపట్టనున్నామని వెల్లడించారు. నాయకులు ఎం.సత్యనారాయణ, శివ, కృష్ణ, మహేశ్, వెంకటేశ్, భాగ్యమ్మ ఉన్నారు.

48 గంటల దీక్ష

ఆమనగల్లు: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. కార్మికులు 48 గంటల దీక్షను ప్రారంభించారు. వీరికి మద్దతుగా ఆయన మాట్లాడారు. కార్మికులను రెగ్యులర్ చేయడంతో పాటు.. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. ఇదే అంశమై ఈ నెల 6న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు స్పష్టంచేశారు. కార్మికులు ఒగ్గు రవి, చిట్టిబాబు, సుధాకర్, పట్టాభి, నర్సింహ, హంసమ్మ, యాదమ్మ, జయమ్మ, లక్ష్మమ్మ, సుగుణమ్మ, బాలమణి, యాదయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న కార్మికులు